హైదరాబాద్‌లో తగ్గిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

- నైట్ ఫ్రాంక్ వెల్లడి


హైదరాబాద్ : గడిచిన నవంబర్‌లో హైదరాబాద్‌లో రూ.2,892 కోట్ల విలువ చేసే 6,119 యూనిట్ల నివాస ఆస్తులు రిజిస్ట్రేషన్ అయ్యాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో 7,768 ప్రాపర్టీలో రిజిస్ట్రేషన్లతో పోల్చితే.. 21 శాతం తగ్గుదల చోటు చేసుకుందని తెలిపింది. గడిచిన అక్టోబర్ నెలవారీ ప్రాతిపదికన యూనిట్లతో పోల్చితే 32 శాతం పెరుగుదల నమోదైనట్లు పేర్కొంది. ప్రస్తుత ఏడాదిలో ఇప్పటి వరకు 62,159 రెసిడెన్షియల్ యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని.. వీటి మొత్తం విలువ రూ.30,415 కోట్లుగా ఉందని తెలిపింది. గత సంవత్సరం ఇదే కాలంలో రూ.33,531 కోట్ల విలువ చేసే 75,453 రెసిడెన్షియల్ యూనిట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని తెలిపింది. హైదరాబాద్ నివాస మార్కెట్‌లో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి అనే నాలుగు జిల్లాలను పరిగణలోకి తీసుకున్నట్లు వెల్లడించింది.

12 నుంచి టై గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్ : అతిపెద్ద ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్ అయిన టై గ్లోబల్ సమ్మిట్‌కు హైదరాబాద్ వేదిక కానుంది. డిసెంబర్ 12 నుంచి 14 వరకు మూడు రోజులపాటు ఈ సమ్మిట్ సాగనుందని టై గ్లోబల్ వైస్ చైర్మన్ కో చైయిర్ మురళి బుక్కపట్నం తెలిపారు. దీనికి 2500 ఎంటర్‌ప్రెన్యర్లు, 500 చార్టర్ సభ్యులు, 150 గ్లోబల్ స్పీకర్లు, ఆరు ఖండాల నుంచి 200 ఇన్వెస్టర్లు పాల్గొననున్నారని వెల్లడించారు. ఫ్యూచర్ టెక్నాలజీ, నూతన ఔత్సాహికం, సస్టయినెబిలిటీ తదితర మూడు థీమ్‌ల్లో ఈ సమ్మిట్ జరగనుందన్నారు. దీనికి ఐటి శాఖ మంత్రి కెటిఆర్, అడోబ్ సిస్టమ్ సిఇఒ శాంతను నారాయణ్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో 22 మంది యూనికార్న్ సంస్థల స్పీకర్లు పాల్గొని మాట్లాడనున్నారని తెలిపారు.

వచ్చేది రైతు ప్రభుత్వమే..

- బిఆర్ఎస్‌కు శ్రీకారం..
- కర్ణాటక నుంచే తొలి అడుగు...
- అక్కడి ఎన్నికల్లో జెడిఎస్‌కు మద్దతు
- భారత రాష్ట్ర సమితి ఆవిర్భావాన్ని ప్రకటించిన కెసిఆర్
- తెలంగాణ భవన్‌లో పతాకావిష్కరణ
- హాజరైన కర్ణాటక మాజీ సిఎం కుమారస్వామి, సినీ నటుడు ప్రకాశ్ రాజ్



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చే ఏడాది రాష్ట్ర ఎన్నికలు.. ఆ తర్వాత నిర్వహించబోయే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేందుకు వీలుగా ముఖ్యమంత్రి కెసిఆర్ వడివడిగా అడుగులేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆవిర్భావాన్ని ఆయన ప్రకటించారు. అనంతరం ఆ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' (వచ్చేది రైతు ప్రభుత్వమే) అంటూ ఆయన ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రం కర్ణాటక నుంచే బిఆర్ఎస్ తన జాతీయ రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తుందని వెల్లడించారు. అక్కడి శాసన సభకు వచ్చే ఏడాదిలో నిర్వహించనున్న ఎన్నికల్లో జెడిఎస్‌కు మద్దతు ఇస్తామని ప్రకటించారు. ఆ పార్టీ నేత, మాజీ సిఎం కుమారస్వామి మరోసారి ముఖ్యమంత్రి కావాలంటూ ఆకాంక్షించారు. బిఆర్ఎస్ అనేది దేశానికే వెలుగుదివ్వెలాంటిందని కెసిఆర్ ఈ సందర్భంగా చెప్పారు. దాని కాంతిని దేశమంతటా ప్రసరింపజేయాలని అన్నారు. ఇందుకనుగుణంగా ఈ నెల 14న ఢిల్లీలో బిఆర్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. పార్టీ ముఖ్య నేతలంతా ఈ నెల 13వ తేదీ సాయంత్రానికి ఢిల్లీ చేరుకోవాలని కెసిఆర్ ఆదేశించారు. మరో రెండు మూడు నెలల్లో భవనం పనులన్నింటినీ పూర్తి చేసుకుని... అక్కడి నుంచే పూర్తిస్థాయి కార్యకలాపాలను ప్రారంభిస్తామని ఆయన వెల్లడించారు.

శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు బిఆర్ఎస్ ఆవిర్భావాన్ని సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి, సినీ నటుడు ప్రకాశ్ రాజ్‌తోపాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) ఏర్పాటు, దాని గెలుపోటములు, ఉద్యమంలో కీలక ఘట్టాలు, ఒడిదుడుకులు, స్వరాష్ట్ర సాధన, ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు తదితరాంశాలను కెసిఆర్ ఈ సందర్భంగా ఏకరువు పెట్టారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అందిస్తున్న పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, వ్యవసాయంతోపాటు ఇతర రంగాల్లో సాధించిన వృద్ధి తదితర అంశాలను ఆయన సోదాహరణరంగా వివరించారు. ఇదే సమయంలో దేశంలో అద్భుతమైన జల వనరులు, సాగు భూమి, సమశీతోష్ణ వాతావరణం ఉన్నాయని సిఎం గుర్తు చేశారు. ఇలాంటి వనరులు, అవకాశాలు ప్రపంచంలోని మరే దేశానికీ లేవని వివరించారు. ఇక్కడున్న మానవ వనరులను వాడుకోలేకపోవడం వల్ల యువ సంపత్తి నిర్వీర్యమైపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భావజాల వ్యాప్తికి శ్రీకారం చుట్టాలనీ, తద్వారా ప్రజల్లో చైతన్యం రగిలించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా, నూతన విధానాలను అమల్లోకి తేవాలని సూచించారు.

నూతన విధానాలు అవసరం...

ఇప్పటి వరకూ దేశాన్ని పాలించిన కేంద్ర పాలకుల వైఫల్యాలను సరిదిద్దుతూ.. దేశ సమగ్రాభివృద్ధి కోసం జాతీయ స్థాయిలో నూతన విధానాలను రూపొందించాల్సిన అవసరముందని కెసిఆర్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. వ్యవసాయాధారిత దేశంలో ఆ రంగం రోజురోజుకీ నిర్లక్ష్యానికి గురవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నూతన వ్యవసాయ విధానాన్ని రూపొందించడం ద్వారా రైతుల బతుకులను బాగు చేయాలని కోరారు. దీంతోపాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధి, మహిళా సాధికారితే లక్ష్యంగా బిఆర్ఎస్ పని చేస్తుందని వివరించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పన కోసం విశ్రాంత జడ్జీలు, ప్రముఖ ఆర్థిక, సామాజిక వేత్తలు, మేధావులు కసరత్తులు ప్రారంభించారని తెలిపారు.

పవర్ ఐ లాండ్‌గా హైదరాబాద్

మైండ్ స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రో పనులకు సిఎం శంకుస్థాపన

పవర్ ఐ లాండ్‌గా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దామని, న్యూయార్క్, లండన్, పారిస్ నగరాల్లో కరెంట్ పోవచ్చు గానీ, హైదరాబాద్‌లో మాత్రం ఒక క్షణం కూడా కరెంట్ పోదని సిఎం కెసిఆర్ అన్నారు. ప్రపంచ చరిత్రలో సుప్రసిద్ధ నగరంగా హైదరాబాద్ కీర్తించబడిందని, చరిత్రలోనే కాదు భవిష్యత్‌లో కూడా హైదరాబాద్ నగరం చరిత్ర పుటల్లో నిలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా రాయదుర్గం మైండ్ స్పేస్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కిలో మీటర్ల మెట్రో రెండో దశ విస్తరణ పనులకు మంత్రులతో కలిసి సిఎం కెసిఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం రాజేంద్రనగర్‌లోని పోలీస్ అకాడమీ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కెసిఆర్ ప్రసంగించారు. హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, ప్రపంచంలోనే పేరుగాంచిన పరిశ్రమలు తమ కార్యాలయాలను పెట్టాయని తెలిపారు. నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు మెట్రో చాలా అవసరమన్నారు. ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ వస్తే 70 వేల మంది ప్రయాణించే అవకాశం ఉందన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేనప్పటికీ వంద శాతం రాష్ట్ర నిధులతో రూ. 6,250 కోట్లతో 31 కి.మీ మెట్రో విస్తరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. జనాభా పెరుగుదల అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ శాఖ భవిష్యత్ అవసరాలను అంచనా వేయాలని సూచించారు. ఉర్దూ మీడియంలో టీచర్ పోస్టుల నియామకంపై సిఎం కెసిఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ముస్లిం నిరుద్యోగ మహిళలు సిఎం సభలో నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు నిరసనకారుల నుంచి ప్లకార్డులను లాక్కొని, వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు.

1,392 జెఎల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- 16 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఇంటర్ విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జెఎల్) పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008లో 1,100 జెఎల్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తెలంగాణలో ఇప్పుడు జెఎల్ పోస్టుల భర్తీకి మొదటి నోటిఫికేషన్‌ను విడుదల చేయడం గమనార్హం. ఈ మేరకు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి అనితా రామచంద్రన్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 16 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు వచ్చేనెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో 724, మల్టీజోన్-2 పరిధిలో 668 కలిపి మొత్తం 1,392 పోస్టులను భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ లేదా జులైలో రాతపరీక్షను నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.



మన్నెగూడలో యువతి కిడ్నాప్

- వందమంది అనుచరులతో యువతి ఇంటిపై నవీన్‌రెడ్డి దాడి
- ఇంట్లో ఫర్నిచర్, వాహనాలు ధ్వంసం
- కుటుంబ సభ్యులను చితకబాదిన వైనం
- నిరసనగా మన్నెగూడ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వంద మంది ఓ యువతి ఇంటిపై దాడిచేసి కిడ్నాప్ చేసిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్నెగూడలో శుక్రవారం నవీన్‌రెడ్డి అనే వ్యక్తి వంద మంది అనుచరులతో యువతి ఇంటిపై దాడి చేసి ఆమెను కిడ్నాప్ చేశారు. యువతి కుటుంబ సభ్యులను చితకబాదారు. ఇంట్లోని ఫర్నిచర్, కారు, సిసి కెమెరాలను ధ్వంసం చేశారు. గతంలోనూ నవీన్ రెడ్డిపై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే అతను రెచ్చిపోయాడని యువతి కుటుంబ సభ్యులు ఆరోపించారు. మన్నెగూడ చౌరస్తాలో యువతి కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించారు. దాంతో ట్రాఫిక్‌తో నాగార్జునసాగర్ రహదారి స్తంభించింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని సిరి టౌన్‌షిప్‌లో ముచర్ల దామోదర్ రెడ్డి, నిర్మల కూతురు వైశాలి డెంటల్ డాక్టర్‌గా పనిచేస్తోంది. ఆ కుటుంబానికి సమీప బంధువైన నవీన్‌రెడ్డి అనే వ్యక్తితో ఆ యువతికి పరిచయం ఉంది. కొంతకాలంపాటు స్నేహంగా మెలిగారు. వీరు పెళ్లి చేసుకునేందుకు యువతి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో నవీన్‌రెడ్డితో వైశాలి దూరంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే నవీన్‌రెడ్డి ఆ యువతిని కిడ్నాప్ చేయాలనుకున్నాడు. ఆ పథకంలో భాగంగానే శుక్రవారం నవీన్‌రెడ్డి సుమారు 100 మందికిపైగా తన అనుచరులతో యువతి ఇంటిపై ఒక్కసారిగా దాడి చేశాడు. ఉదయం 11:30 గంటల సమయంలో యువతి ఇంటిలోకి నవీన్‌రెడ్డి అనుచరులు ఒక్కసారిగా దూసుకువచ్చారు. ఇంటి ముందున్న కారు అద్దాలు, ఇంట్లోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఇంట్లోనే ఉన్న వైశాలి, ఆమె తల్లిదండ్రులైన ముత్యాల దామోదర్ రెడ్డి, నిర్మలపై దాడి చేశారు. పక్కనే ఉన్న మరికొందరు ఆపే ప్రయత్నం చేయగా వారిపై సైతం దాడికి దిగారు. యువతిని బలవంతంగా కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లారు. వెంటనే యువతి తల్లిదండ్రులు 100 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. గతంలోనూ నవీన్‌రెడ్డిపై ఆదిభట్ల పోలీసుస్టేషన్‌లో యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిర్లక్ష్యం చేయడం వల్లనే నవీన్‌రెడ్డి రెచ్చిపోయి తమపై దాడి చేసి కూతుర్ని కిడ్నాప్ చేశారని ఆరోపిస్తూ మన్నెగూడ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. యువతి కిడ్నాప్ వ్యవహారం కలకలం సృష్టించడంతో ఇబ్రహీంపట్నం ఎసిపి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన దాడిపై ఆరా తీశారు. రాచకొండ కమిషనరేట్ అడిషనల్ సిపి సుధీర్‌బాబు, ఎల్బీనగర్ డిసిపి సన్‌ప్రీత్ సింగ్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. దాడి ఘటనను సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నవీన్‌రెడ్డి నడుపుతున్న టీ సెంటర్‌ను యువతి కుటుంబ సభ్యులు ధ్వంసం చేసి నిప్పంటించారు. అందులో పని చేస్తున్న సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కిడ్నాప్ అయిన యువతి నల్లగొండ జిల్లా పరిధిలోని ముసంపల్లి దగ్గర ఉన్నట్టు సోషల్‌మీడియాలో వార్తలు రాగా, వాటిని నల్లగొండ పోలీసులు ఖండించారు.

ఉద్యమాల దిక్సూచి 'ఎస్‌ఎఫ్‌ఐ'

- విద్యారంగ సమస్యలపై నిరంతర సమరభేరి
- నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ఉద్యమం
- విద్యా వ్యతిరేక విధానాలపైనే మహాసభలో చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలోని విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) నిరంతరం సమరభేరి మోగిస్తున్నది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విద్యావ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తున్నది. నూతన జాతీయ విద్యావిధానం-2020కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపట్టింది. పేద విద్యార్థులకు ఎలాంటి నష్టం కలుగుతుందో, మహిళలు విద్యకు ఎలా దూరమవుతారో, డ్రాపౌట్ రేటు ఎలా పెరుగుతుందో విస్తృతంగా ప్రచారం చేసింది. మతతత్వ భావాలను పాఠ్యాంశాల్లో చేర్చుతూ విద్యార్థులకు శాస్త్రీయ విద్యను అందించకుండా చేసిన పద్ధతులను వ్యతిరేకించింది. స్వాతంత్ర్యోద్యమానికి సంబంధించిన చరిత్రను వక్రీకరిస్తూ పాఠ్యాంశాల్లో, ఆజాదీకా అమృత మహోత్సవాల పేరుతో నిర్వహించిన కార్యక్రమాల్లో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వాస్తవాలను కప్పిపుచ్చడాన్ని ప్రశ్నించింది. మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల పాఠ్యాంశాలను తొలగించి హేగ్డేవార్, వీర్‌సావర్కర్ వంటి వారి చరిత్రను చేర్చడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకోవైపు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ఫెడరలిజం, లౌకిక పునాదులపై కేంద్రం దాడులు చేసింది. ఇలాంటి ప్రమాదకరమైన అంశాలపై సభలు, ఇష్టాగోష్టులు, సెమినార్లు, రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించింది. అందరికీ విద్య.. అందరికీ ఉపాధి కల్పించాలని కోరుతూ దేశవ్యాప్తంగా జాతాలను నిర్వహించింది. దేశంలోని విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేసింది. ఇలా విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై అవిశ్రాంతంగా కృషి చేస్తున్న 'ఎస్‌ఎఫ్‌ఐ' పోరాటాలకు వేగుచుక్కగా నిలిచిందనడంలో సందేహం లేదు. అందుకే ఆ సంఘం వెంటే విద్యార్థులున్నారు.

నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాటం

దేశవ్యాప్తంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. జెఎన్‌యూలో కన్నయ్యకుమార్, షెల్లా రశీద్, ఉమర్‌ఖలీద్‌పై రాజద్రోహం కేసు పెట్టింది. వారిని జైలులో నిర్బంధించింది. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్‌పిఆర్‌ను తెచ్చింది. వీటికి వ్యతిరేకంగా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు పెద్దఎత్తున ప్రతిఘటించారు. జామియా మిలియా వర్సిటీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఆ పోరాటంలో విద్యార్థులను ఐక్యం చేసి ఎస్‌ఎఫ్‌ఐ ముందుభాగంలో నిలబడింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం, హెచ్‌సీయూ, వారణాసి, పాండిచ్చేరి, కర్నాటక వంటి వర్సిటీల్లోనూ విద్యార్థులపై దాడులు జరిగాయి. ఇలా విద్యారంగం సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో విశ్వవిద్యాలయాల్లో ఎస్‌ఎఫ్‌ఐకి ప్రత్యేక గుర్తింపు లభించింది. దానివల్ల విద్యార్థి సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ విజయకేతనం ఎగురవేసింది. జేఎన్‌యూ, హెచ్‌సీయూ, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కర్నాటక, గుజరాత్, బెంగాల్‌లోని జాదవ్‌పూర్ వంటి విశ్వవిద్యాలయాల్లో ఎస్‌ఎఫ్‌ఐ గెలిచింది.

రాజ్యాంగాన్ని రక్షించాలి... ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

టి నాగరాజు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత 17వ మహాసభల్లో రాజ్యాంగాన్ని రక్షించుకోవాలనీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాన చర్చ ఉంటుంది. విద్యార్థుల హక్కుల కోసం పోరాడాలి. నూతన జాతీయ విద్యావిధానం రద్దు చేయాలని కోరుతూ ఉద్యమించాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందించాలి. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్న మోడీ హామీ అమలుకు నోచుకోలేదు. అందరికీ విద్య.. అందరికీ ఉపాధి కల్పించాల్సిన అవసరమున్నది. మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం.

మాటల తూటాలు అంజయ్య పాటలు

- మాజీ స్పీకర్ మధుసూదనాచారి

ప్రజాశక్తి - కల్చరల్

ఊరు మనదిరా.. ఈ వాడ మనదిరా... దొర ఎందిరో, వాడి పీకు డెందిరో... వంటి మాటల తూటాలను పాటలుగా మలచి తెలంగాణ ప్రజల్లో ఉత్తేజం నింపిన గూడ అంజయ్య తెలంగాణ ప్రజా వాగ్గేయకారుడు అని రాష్ట్ర తొలి శాసనసభ సభాపతి ఎస్.మధుసూదనాచారి అన్నారు. శ్రీత్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా శుక్రవారం గూడ అంజయ్య జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా మధుసూదనాచారి పాల్గొని మాట్లాడుతూ అంజయ్య ఆదిలాబాద్‌లోని మారుమూల పల్లెలో పుట్టి ఆదివాసీ, మూలవాసీల జీవితాలను చూసి కలత చెంది ఉద్యమ బాట



పట్టారన్నారు. అరుణోదయ సంస్థలో క్రియాశీలక పాత్ర పోషించిన అంజయ్య తెలంగాణ కోసం ఉద్యమించారని చెప్పారు. ఆయన రాసిన పలు పాటలు సినిమాలలో ఉపయో గించుకున్నారని వివరించారు. రాజీలేని పోరాట యోధుడు అంజయ్య అని నివాళులర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై నటుడు మానిక్, జయసూర్య, టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శవాది దేవులపల్లి యాకయ్య

- ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలి : తమ్మినేని
- సంతాపం ప్రకటించిన సిపిఎం ఎపి కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నమ్మిన సిద్ధాంతం కోసం ఉన్న ఉద్యోగాన్ని వదిలేసి పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన ఆదర్శవాది దేవులపల్లి యాకయ్య అని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలో పార్టీ సీనియర్ నాయకులు దేవులపల్లి యాకయ్య శుక్రవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఆయన భౌతికాయాన్ని సిపిఎం రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వం, సిపిఐ, న్యూ డెమోక్రసీ, ప్రజాపంథా, టిఆర్ఎస్, టిడిపి, న్యూ డెమోక్రసీ పార్టీలతో పాటు సామాజిక, ప్రజాసంఘాల నాయకులు సందర్శించి సంతాపం తెలియజేశారు. అనంతరం జరిగిన సంతాప సభలో తమ్మినేని మాట్లాడుతూ.. మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలో యాకయ్యను చూసి నేర్చుకోవచ్చని, తాను ఒక్కడే కాకుండా కుటుంబం మొత్తాన్ని సిపిఎంలో నిలబడేలా చేశారన్నారు. ఇల్లందు నియోజకవర్గం, జిల్లాలో పార్టీ అవసరాల నిమిత్తం ఎక్కడికి పంపినా వెళ్లి బాధ్యతలు నిర్వహించారని, పార్టీ విస్తరణలో చివరి శ్వాస వరకు కృషి చేశారని తెలిపారు. ఇల్లందు మున్సిపాలిటీలో మూడు పర్యాయాలు వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసి గెలిచారని, కష్ట సమయాల్లో పార్టీని అంటిపెట్టుకొని ఎన్ని అవరోధాలు వచ్చినా జంకకుండా పార్టీ పిలుపుని అమలు చేయడంలో కీలకపాత్ర పోషించారన్నారు. కార్మిక రంగంలోనూ, వ్యవసాయకూలీల సమస్యల పైన, అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించాడని, పార్టీ పట్టణ, డివిజన్ కార్యదర్శిగా, జిల్లా కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించారని అన్నారు.

యాకయ్య మృతికి సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో సంతాపం తెలిపి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యాకయ్యకు భార్య సోమలక్ష్మి, కుమార్తె సంధ్య ఉన్నారు. సంతాప సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి వెంకట్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, మండల కార్యదర్శి అబ్దుల్



సంతాప సభలో మాట్లాడుతున్న తమ్మినేని

నబీ, ప్రజాపంథా నాయకులు గుమ్మడి నరసయ్య, సిపిఐ రాష్ట్ర నాయకులు కె సారయ్య, న్యూ డెమోక్రసీ, టిడిపి, డిబిజికెఎస్ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దేవులపల్లి యాకయ్య మరణం పట్ల సిఐటియు సంతాపం

దేవులపల్లి యాకయ్య మరణం పట్ల సిఐటియు రాష్ట్ర కమిటీ సంతాపం తెలిపింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీనియర్ నాయకులు, ఉపాధ్యక్షులు పి రాజారావు, కోశాధికారి వంగూరు రాములు, కార్యదర్శి బి మధు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాలడుగు సుధాకర్ శుక్రవారం ఇల్లందులోని యాకయ్య నివాసం వద్ద ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేవులపల్లి యాకయ్య 1975లో ప్రజా ఉద్యమంలోకి వచ్చారనీ, 47 ఏళ్లుగా సిఐటియు, సిపిఎంలో కీలకంగా పనిచేశారని గుర్తుచేశారు. ఇల్లందు, పోలంపల్లిలో సింగరేణి వర్కర్‌గా ఉన్నప్పుడు సింగరేణి యాజమాన్యం డిస్మిస్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. రాజారావు నాయకత్వంలో సిపిఎం పూర్తికాలం కార్యకర్తగా, ఆ పార్టీ ఇల్లందు టౌన్ కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. ఆయన సిపిఎం నుంచి మూడుసార్లు కౌన్సిలర్‌గా గెలుపొందారని తెలిపారు. వ్యవసాయ కార్మిక, యువజన ఉద్యమాల్లోనూ ముందుండి పోరాడారని కొనియాడారు.

మత విభజనతోనే గుజరాత్‌లో బిజెపి గెలుపు

- ఎలక్షన్ బాండ్ల పేరిట భారీగా డబ్బు వసూలు
- దేశ ప్రయోజనాల కోసం బిజెపి వ్యతిరేక శక్తులను ఐక్యం చేయాలి
- మునుగోడు ఎన్నికల తర్వాత కమ్యూనిస్టుల గౌరవం పెరిగింది
- 29 నుంచి జరిగే వ్యకాస రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి : తమ్మినేని



విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌లో మత విభజన పెద్ద ఎత్తున జరిగిందని, దానితోనే బిజెపి ఈ ఎన్నికల్లో గెలుపొందిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో బిజెపి లబ్దిపొందుతోందని తెలిపారు. ఎలక్షన్ బాండ్ విధానం పేరుతో భారీగా డబ్బు వసూలు చేసి.. వాటినే ఎన్నికల్లో ఖర్చు పెడుతోందని విమర్శించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మతవిద్వేషాలను రెచ్చగొట్టడంలో బిజెపి పాచికలు పారలేదు కాబట్టే అక్కడ ఓడిపోయిందన్నారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ఖమ్మంలో నిర్వహించే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి అధ్యక్షతన స్థానిక మంచికంటి మీటింగ్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో తమ్మినేని మాట్లాడారు. మత విభజన జరగకుండా చూడటంతో పాటు బిజెపి వ్యతిరేక శక్తులను ఐక్యంగా ఉంచడమే ధ్యేయంగా సిపిఎం పనిచేస్తోందన్నారు. బిజెపికి దీటుగా ప్రస్తుతం కెసిఆర్ పోరాడుతున్నా ప్రాంతీయ పార్టీలు రాజకీయ అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తాయనే విషయాన్ని విస్మరించడానికి వీల్లేదన్నారు. రాజ్యాంగ విలువలను నాశనం చేస్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బిజెపితో దేశానికి ప్రమాదం పొంచివున్న నేపథ్యంలో ఆ పార్టీ వ్యతిరేక శక్తులను చేరదీస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగానే కెసిఆర్‌కు దగ్గరయ్యామన్నారు. బిజెపికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడితేనే కెసిఆర్‌కు మద్దతు ఉంటుందన్నారు. భవిష్యత్తులో పొత్తులు కుదిరే అవకాశం ఉండవచ్చు కానీ ఇప్పటి వరకూ దీనిపై ఏ పార్టీతోనూ చర్చలు జరగలేదని చెప్పారు. రాష్ట్రంలో తొమ్మిది నియోజకవర్గాలపై కేంద్రీకరణ యథావిధిగా కొనసాగుతుందన్నారు. దీనిలో జిల్లాలోనే నాలుగు స్థానాలు ఉన్నాయని చెప్పారు. మునుగోడు ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌తో కలిసి బిజెపిని ఓడించడంతో కమ్యూనిస్టుల పట్ల గౌరవం పెరిగిందన్నారు. కేంద్రం విచ్చలవిడిగా ధరలు పెంచుతున్న నేపథ్యంలో గ్రామీణ నిరుపేదలపై విపరీతంగా భారం పడుతోందన్నారు. జిల్లాలో జరిగే వ్యవసాయ కార్మికసంఘం మహాసభలకు భారీగా జన సమీకరణ చేసి కేంద్రం విధానాలు, ధరల పెరుగుదలను తిప్పికొట్టాలన్నారు. ఖమ్మంలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు రాష్ట్ర రాజకీయాలను మలుపు తిప్పాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మహాసభల విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. ప్లీనరీ ప్రారంభానికి ముందు పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్యాణం వెంకటేశ్వరరావు సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, భూక్యా వీరభద్రం, బండి రమేష్, బొంతు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎఐ ఆర్‌ఒకు వినతి అందజేస్తున్న ఫెడరేషన్

టోల్‌ఛార్జీలు రద్దుచేయండి

- ఎన్‌హెచ్‌ఎఐ ఆర్‌ఒకు ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ఉన్న టోల్‌గేట్ల దగ్గర జర్నలిస్టుల నుంచి వసూలు చేస్తున్న ఛార్జీలను రద్దుచేస్తూ ఫాస్టాగ్ మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఎఐ) ప్రాంతీయ అధికారి ఎ కృష్ణప్రసాద్‌కు ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం వినతిపత్రం సమర్పించింది. టోల్‌గేట్ల దగ్గర జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను దాదాపు గంటపాటు ఆర్‌వోతో చర్చించింది. సమాజం కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న జర్నలిస్టుల నుంచి టోల్ ఫీజులను వసూలు చేయడం న్యాయం కాదని ఫెడరేషన్ అభిప్రాయపడింది. కరోనా పరిస్థితుల్లో ఆర్థికంగా జర్నలిస్టులు చితికిపోయారనీ, మానసిక, అనారోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య ఎన్‌హెచ్‌ఎఐ ఆర్‌ఒ దృష్టికి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మంది జర్నలిస్టులు ఉన్నారనీ, వారందరికి టోల్‌గేట్ల దగ్గర ఫాస్టాగ్ మినహాయింపు ఇవ్వాలని కోరారు. టోల్ ఫీజు వసూళ్ల మూలంగా ఆర్‌టిసి రాయితీ సైతం తగ్గి బస్సుఛార్జీలు సైతం అధికంగా చెల్లించాల్సి వస్తోందని గుర్తు చేశారు. దీంతో ఆర్థికభారం మరింత అధికంగా పడుతున్నదని అభిప్రాయపడ్డారు. ఇందుకు స్పందించిన ఎన్‌హెచ్‌ఎఐ ప్రాంతీయ అధికారి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జర్నలిస్టులకు ఫాస్టాగ్ మినహాయింపు ఇచ్చే విషయమై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తాననీ, కేంద్ర ప్రభుత్వ ఉపరితలరవాణా శాఖ దృష్టికి సైతం తీసుకుపోతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రాంచందర్, గుడిగ రఘు, కార్యదర్శి బి రాజశేఖర్, హెచ్‌యూజే అధ్యక్షులు బి అరుణ్‌కుమార్, కార్యదర్శి బి జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పులి పాదముద్రలను గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు

రాజుర శివారులో పులి సంచారం

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ జిల్లాలో పులి సంచారం జనానికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆసిఫాబాద్ మండలంలోని రాజుర శివారులో శుక్రవారం ఉదయం పత్తి తీసేందుకు వెళ్లిన స్థానికులకు దూరంలో పులి కనిపించడంతో ఊర్లోకి పరుగు తీశారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అక్కడికి వెళ్లి పాదముద్రలను గుర్తించి పులి సంచరించినట్టు నిర్ధారించారు. గ్రామ శివారులో వాగులో నీటి కోసం పులి వచ్చి ఉండొచ్చని అటవీశాఖ అధికారులు తెలిపారు. గ్రామస్తులు ఎవరూ రాత్రిపూట అటవీ ప్రాంతాల్లో సంచరించవద్దని సూచించారు. ప్రస్తుతం పులి భీంపూర్ వైపు వెళ్లినట్టు నిర్ధారించారు. రాజుర గ్రామ ప్రజలతోపాటు సమీప ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులకు అటవీ అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాన్ని సందర్శించిన వారిలో అటవీశాఖ అధికారులు సెక్షన్ అధికారులు సతీష్, రవీందర్, బీట్ అధికారులు రవి, దేవేందర్ ఉన్నారు.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ విద్యకు ప్రాధాన్యత

- అటవీ విద్యనభ్యసిస్తున్నవారు భవిష్యత్ ఇంజినీర్లు
- ఐపిఆర్ జాతీయ సదస్సులో అటవీ నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలతో అటవీ, పర్యావరణ విద్యకు ప్రాధాన్యత పెరుగుతోందని పలువురు అటవీ నిపుణులు అన్నారు. పర్యావరణ విద్యను అభ్యసిస్తున్నవారు భవిష్యత్ ఇంజినీర్లు అని చెప్పారు. అటవీ సంపదను కాపాడటం ఎంత ముఖ్యమో, అడవులపై ఆధారపడి జీవిస్తున్నవారికి, రైతులకు మెరుగైన ఆదాయం అందేలా చూసే కొత్త అటవీ పరిశోధనలూ అంతే అవసరమని నొక్కి చెప్పారు. హైదరాబాద్ సమీపంలోని తెలంగాణ అటవీ కళాశాల, పరిశోధనా సంస్థలో అటవీ జన్యు వనరుల పరిరక్షణ, నిర్వహణ, మేధోపరమైన హక్కులు(ఐపిఆర్) అనే అంశంపై శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. అడవులు, పర్యావరణం, జీవివైవిధ్యం, సిల్వికల్చర్, టిష్యూకల్చర్, ఫారెస్ట్రీలో మేధోపరమైన హక్కుల ప్రాదాన్యత, తదితర అంశాలపై తెలంగాణ హార్టీకల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి నీరజా ప్రభాకర్, కర్ణాటక ధార్వాడ్ (సిర్సి) ఫారెస్ట్ కాలేజీ డీన్ డాక్టర్ ఆర్ వాసుదేవ, తమిళనాడు మెట్టుపలాయం ఫారెస్ట్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్. ఎ బాలసుబ్రమణియన్, కేరళ ఫారెస్ట్ కాలేజీ డీన్ డాక్టర్ ఇవి అనూప్, ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐకార్) సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్ పరిమళన్, హిమాచల్‌ప్రదేశ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అభిలాష్ దామోదరన్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ప్రస్తుతం సాంకేతిక విద్యకు ఎంత ప్రాధాన్యత ఉందో, రానున్న రోజుల్లో అటవీ, పర్యావరణ నిపుణులకు అంతే డిమాండ్ ఉంటుందని అన్నారు. ముందుచూపు, దార్శనికతతో తెలంగాణ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అటవీ విద్యను ప్రోత్సహించటం గొప్ప విషయమనీ, తెలంగాణకు హరితహారం చాలా మంచి కార్యక్రమమని జాతీయ అటవీ నిపుణులు అన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పుడు మొక్కలు నాటడం, అడవుల రక్షణ చర్యలు చేపట్టం వంటి అంశాల్లో స్వర్ణయుగం నడుస్తోందని చెప్పారు. సిల్వికల్చర్, టిష్యూకల్చర్ ద్వారా అభివృద్ధి పరిచిన కొత్త అటవీ వంగడాలు తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తిని ఇచ్చేలా అభివృద్ధి చేశామని అన్నారు.

ఒకప్పుడు 45 ఏళ్లకు దిగుబడినిచ్చే టేకు ఇప్పుడు ఇరవై ఏళ్లలోపే యాభై ఏళ్లకు వచ్చే ఎర్రచందనం పంట ఇప్పుడు 16 ఏళ్లకే పూర్తిస్థాయి చెట్టుగా మారి ఆదాయవనరుగా మారుతున్నాయని చెప్పారు. ఈలోపు రైతులు అంతర పంటలుగా మిరియాలు, తమలపాకు లాంటి వాణిజ్యపంటలు సాగుచేయవచ్చనని సూచించారు. అడవులు, పర్యావరణ, జీవవైవిధ్యం పరంగా మన దేశం చాలా వృద్ధిలో ఉందనీ, అటవీ ఉత్పత్తులకు పేటెంట్లు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డిమాండ్, సప్లయ్ పరంగా మరింత అధ్యయనం జరగాల్సి ఉందని నొక్కి చెప్పారు. విద్యార్థులు దేశంలోని విభిన్న మొక్కలు, వృక్ష జాతులు, జంతుజాలంపై అధ్యయనంతో పాటు, పట్టు పెంచుకోవాలని సూచించారు. తెలంగాణ ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ దేశంలో వివిధ ప్రముఖ కాలేజీలు, సంస్థల అటవీ నిపుణుల సలహాలు, సూచనలు విద్యార్థులకు ఉపయోగపడతాయని అన్నారు. తెలంగాణకు హరితహారంలో ఈ సెమినార్ ద్వారా వచ్చిన ప్రతిపాదనలను సమన్వయం చేస్తామనీ, తెలంగాణ రైతులు సాంప్రదాయ పంటలకు తోడు, మరింత మెరుగైన రాబడిని ఇచ్చే చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఫారెస్ట్ కాలేజీ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస రావు, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మత్స్యకారులు

పెండింగ్ ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియో మంజూరు చేయాలి : లెల్లేల బాలకృష్ణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మత్స్యకారుల ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియో వెంటనే మంజూరు చేసి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ప్రమాదంలో మరణించిన, తీవ్రంగా గాయపడిన మత్స్యకారుల కుటుంబాలకు ఇన్సూరెన్స్ రూ.పది లక్షలు, ఎక్స్‌గ్రేషియో రూ.పది లక్షలు రైతు బీమా మాదిరిగా విడుదల చేయాలని కోరారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మత్స్యశాఖ కమిషనరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మా మాట్లాడుతూ.. వైద్యం చేయించుకోలేక అనారోగ్య కారణాలతో, గుండెపోటు, పక్షవాతం, ఇతర రోగాలతో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రైతుబీమా పథకం మాదిరిగా ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రూ.20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2020-2021లో ఫిష్‌కో ఫెడ్ వద్ద ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించలేక పెండింగ్‌లో ఉన్న మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. మత్స్యకారులకు రైతు బీమా వస్తే.. మత్స్యకార శాఖ ద్వారా ఇచ్చే ఎక్స్‌గ్రేషియోను రద్దు చేయడం సరైంది కాదన్నారు. అనంతరం మత్స్యశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చనమోని శంకర్, ముఠా విజయ, నాయకులు ముఠా దశరథ్, పూలగాజుల జంగయ్య, జిలమోని ముత్తమ్మ, తవిటి యాదగిరి, గిరిప్రసాద్, కూర రాములమ్మ, గొట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన జియో సైంటిస్టుల 46వ ఓరియంటేషన్ కోర్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జియో సైంటిస్టుల 46వ ఓరియంటేషన్ కోర్సు ముగిసింది. ఈ మేరకు శక్రవారం హైదరాబాద్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జిఎస్ఐ) కార్యాలయంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేత నియమించబడిన 64 మంది జియో సైంటిస్టుల కోర్సు ముగింపు కార్యక్రమానికి జిఎస్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రాజు అధ్యక్షత వహించారు. వీరంతా దాదాపు 11 నెలల పాటు దేశంలోని వివిధ భౌగోళిక ప్రాంతాల్లో శిక్షణ పొందారు. హెడ్ మిషన్ 5, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సిహెచ్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ శిక్షణకాలంలో నేర్చుకున్న సాంకేతికతను ఉపయోగించుకోవాలనీ, అంకితభావంతో పని చేయాలని తెలిపారు.డాక్టర్ రాజు మాట్లాడుతూ భౌగోళిక శాస్త్రవేత్తలే సంస్థ భవిష్యత్తు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిఎస్ఐటిఐ డైరెక్టర్ ఆర్.విజయ్ కుమార్, హైదరాబాద్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ భాటియా తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ

- మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులకు శుక్రవారం హైదరాబాద్‌లోని మినిష్టర్స్ క్వార్టర్‌లో మంత్రి సత్యవతి రాథోడ్ ల్యాప్‌టాప్‌లతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ప్రయివేటుకు ధీటుగా గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదని తెలిపారు. దేశానికే రాష్ట్ర గురుకులాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కెజి టు పిజి ఉచిత విద్యను గురుకులాల్లో అందిస్తున్నామని చెప్పారు. గతంతో పోలిస్తే గిరిజనుల్లో అక్షరాస్యత శాతం పెరిగిందన్నారు. ప్రతిభా కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు ఐఐటీ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీలకు ఉచిత నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది వందల మంది జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో అడ్మిషన్ పొందుతూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు చెప్పారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు, సొసైటీ కార్యదర్శి రొనాల్డ్ రాస్, అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, డిప్యూటీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ఒఎస్‌డి రంగారెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ఐఆర్‌డిఎఐ డ్రాఫ్టును కేంద్రం ఉపసంహరించాలి

- ఎల్‌ఐసిఎఒఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్
- ఎల్‌ఐసి ఏజెంట్లు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి
- ఇందిరాపార్కు వద్ద ఎల్‌ఐసిఎఒఐ ఆధ్వర్యంలో మహాధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్‌డిఎఐ) డ్రాఫ్టును వెంటనే ఉపసంహరించుకోవాలని ఎల్‌ఐసిఎఒఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి పిజి దిలీప్ డిమాండ్ చేశారు. ఐఆర్‌డిఎఐ డ్రాఫ్టును ఉపసంహరించుకోవాలని శుక్రవారం ఎల్‌ఐసిఎఒఐ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 19 రాష్ట్రాల నుంచి వేలాదిమంది ఎల్‌ఐసి ఏజెంట్లు తరలివచ్చారు. ప్లకార్డులతో తమ డిమాండ్లను తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2003లో ట్రేడ్ యూనియన్ యాక్ట్ ప్రకారం ఎల్‌ఐసిఎఒఐ ఆవిర్భవించిందని.. ఆ నాటి నుంచి ఏజెంట్ల సంక్షేమం కోసం పాటుపడుతూ ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులను కాపాడుతోందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఐఆర్‌డిఎఐ డ్రాఫ్ట్ వల్ల ఎల్‌ఐసి ఏజెంట్ల మనుగడతోపాటు వ్యవస్థ కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడనుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. డ్రాఫ్టును ఉపసంహరించకోకపోతే దేశ వ్యాప్తంగా ఎల్‌ఐసి ఏజెంట్లు పెద్దఎత్తున ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థను అగ్రభాగాన నిలబెట్టడంలో ఎల్‌ఐసి ఏజెంట్ల పాత్ర మహోన్నతమైందని చెప్పారు. ఇలాంటి వ్యవస్థను కాపాడాల్సిన ప్రభుత్వం దాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ బంగాళాఖాతంలో కలిపివేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్‌ఐసి ఏజెంట్ల సమస్యలను ప్రధాని, తెలంగాణ సిఎంకు లేఖల ద్వారా పంపించి వివరిస్తామని చెప్పారు. ఆర్గనైజేషన్ సౌత్ జోన్ అధ్యక్షులు ఎల్ మంజునాథ్, ప్రధాన కార్యదర్శి నరసింహారావు మాట్లాడుతూ.. ఎల్‌ఐసిని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో లక్షలాది మంది ఎల్‌ఐసి ఏజెంట్లు నిరుద్యోగులుగా మారే ప్రమాదం ఉందన్నారు. దేశ ప్రజలంతా కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఐఆర్‌డిఎఐ డ్రాఫ్టును ఉపసంహరించుకునే వరకు పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆలిండియా వైస్ ప్రెసిడెంట్, మాజీ ఎంపి వాసుదేవ్ ఆచార్య, ఎఐఇఎ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా పాల్గొన్నారు.

టిఆర్‌ఎస్ కూలీ వసూళ్లపై ఫిర్యాదులు

- బిఆర్‌ఎస్‌గా ఎలా మార్చుతారు
- అభ్యంతరాలకు ఎన్నికల సంఘం సమయమివ్వలేదు
- పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్‌ఎస్ (2017)లో బంగారు కూలీల పేరుతో టిఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు వ్యాపారస్తుల నుంచి కోట్ల రూపాయలు బహిరంగంగా వసూలు చేశారని పిసిసి అధ్యక్షులు, ఎంపి ఎనుముల రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. ఈ వ్యవహారంపై అనేక ఫిర్యాదులు ఉన్నాయనీ, ఈ నేపథ్యంలో టిఆర్‌ఎస్‌ను బిఆర్‌ఎస్‌గా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీయన్ ఐడియాలజీ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. బంగారు కూలీ పేరుతో వందల కోట్లు వసూలు చేసిన గులాబీ పార్టీ ఎక్కడా లెక్కలు చూపించలేదని తెలిపారు. దానిపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని విమర్శించారు. ఢిల్లీ హైకోర్టులో తాను కేసు వేశాననీ, తమ వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు బంగారు కూలీల వ్యవహారంలో టిఆర్‌ఎస్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించిందని గుర్తు చేశారు. ఎటువంటి చర్యలు తీసుకోకుండా టిఆర్‌ఎస్ పేరును మార్చడానికి వీలులేదని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించడం లేదంటూ, తక్షణమే ఈ ప్రక్రియపై స్టే ఇవ్వాలంటూ తాను ఈ నెల ఆరున ఢిల్లీ హైకోర్టులో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఏడున ఆ పార్టీకి నోటీసు జారీ చేసిందనీ, సోమవారం విచారణకు వస్తుందని చెప్పారు. ఈ క్రమంలోనే ఆగమేఘాల మీద ఎన్నికల సంఘం టిఆర్‌ఎస్ పేరు మారుస్తూ లేఖ పంపిందని విమర్శించారు. దీనిపై పిఎం, ఆర్థికమంత్రి, హోంమంత్రి, ఇడి, సిబిఐ తదితర సంస్థలకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బిజెపి సూచనలతోనే ఎన్నికల కమిషన్.. టిఆర్‌ఎస్‌కు సహకరించిందన్నారు. దక్షిణ భారతదేశంలో బీఆర్‌ఎస్‌ను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ఓటు బ్యాంకును చీల్చేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని చెప్పారు. మోడీని చీల్చి చెండాడుతా అన్న కెసిఆర్ గుజరాత్‌లతో కేజ్రీవాల్‌తో కలిసి మోడీ వ్యతిరేకంగా ఎందుకు ప్రచారం చేయలేదని నిలదీశారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన సోనియాకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్త శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన 1065 మందిని ఆయన అభినందించారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న వారిలో ఇప్పటివరకు 609 మంది కార్యకర్తలు మరణించారు. అందులో వంద మంది కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల రాజీవ్‌గాంధీ బీమా చెక్కులను రేవంత్ పంపిణీ చేశారు.

ఉస్మానియా ఆస్పత్రి కొత్త బిల్డింగ్ వెంటనే కట్టాలి

- మెడికల్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా ఆస్పత్రి కొత్త బిల్డింగ్‌ను వెంటనే కట్టాలని ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమిని అసోసియేషన్ సభ్యులు, వైద్యుల అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఉస్మానియా మెడికల్ కళాశాల అల్యూమినియం అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ విద్యార్థులు, ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు సూపరింటెండెంట్ కార్యాలయం నుంచి మెడికల్ కళాశాల వరకు నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అఫ్జల్‌గంజ్, ఫీల్ కాన, సిద్ధి అంబర్ బజార్, ఉస్మాన్ గంజ్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా వైద్యుల అసోసియేషన్ సంఘం నాయకులు డాక్టర్ బొంగు రమేష్ మాట్లాడుతూ.. ఆస్పత్రికి కొత్త భవనం వెంటనే నిర్మించాలని కోరారు. భవనం శిథిలావస్థకు చేరిందని, ఆస్పత్రికి పెరుగుతున్న రోగుల తాకిడితో ఉన్నటువంటి భవనంలోనే వసతులను సమకూర్చుకోవడం, వైద్య సేవలు అందించడంతో ఇబ్బందిగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎనిమిదేండ్లుగా ప్రభుత్వం కొత్త బిల్డింగ్ కట్టిస్తామని చెబుతోందని తప్ప పనులు ప్రారంభించలేదని రిటైర్డ్ వైద్య బృందం ఆరోపించింది. ఉస్మానియా ఆస్పత్రి వైద్యుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ధనలక్ష్మి మాట్లాడుతూ.. ఆసియాలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన ఉస్మానియా ఆస్పత్రికి కొత్త భవనం వెంటనే నిర్మించాలన్నారు. ప్రభుత్వం, కోర్టు స్పందించి కొత్త బిల్డింగ్ నిర్మించి పూర్వవైభవాన్ని తీసుకురావాలని కోరారు. ఎన్‌ఎంసీ నిబంధన ప్రకారం సర్వీస్ సౌకర్యాలను మరింతగా మెరుగుపరచాలన్నారు. ప్రస్తుతం ఉన్న బిల్డింగ్‌లోనే రోగులను సమకూర్చడంతో బెడ్లు సరిపోక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ విషయంపై ఇంటెక్ కన్వీనర్ అనురాధ స్పందిస్తూ.. ఉస్మానియా ఆస్పత్రి పాత బిల్డింగ్‌ను పునరుద్ధరించి ఖాళీ స్థలంలో కొత్త బిల్డింగ్ కట్టాలని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు.



పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో రేస్ నిర్వాహకులతో చర్చిస్తున్న సిపి ఆనంద్

ఫార్ములా ఇ - రేస్‌కు హైదరాబాద్ ఆతిథ్యం

- మొదటిసారీ ఈవెంట్‌తో ప్రపంచ స్థాయి దృష్టి
- భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించిన సిపి ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వేదికగా మొట్టమొదటి సారి ఫార్ములా ఈ- రేస్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఫెడరేషన్ ఇంటర్నేషనల్ డీఎల్ ఆటోమొబైల్ (ఎఫ్ఐఎ), తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహించనుండటంతో అందరిలో ఆసక్తి నెలకొంది. ఫిబ్రవరి 11న హుస్సేన్‌సాగర్ చుట్టూ కొనసాగనున్న ఈ రేస్‌కు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 నుంచి 35వేల మంది హాజరయ్యే అవకాశం ఉండటంతో నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. అలాగే, ఈ రేసు సన్నద్ధతలో భాగంగా శని, ఆదివారాల్లో ఇండియన్ రేసింగ్ లీగ్ చివరి సిరీస్ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో రెండ్రోజులు ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇదిలా ఉండగా, శుక్రవారం బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్‌లో రేస్ నిర్వాహకులతో నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్ సమావేశమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు బ్లూప్రింట్‌పై చర్చించారు. ప్రైవేటు సెక్యూరిటీ ఏజెన్సీలు, భద్రత ఏర్పాట్లపై పలు సూచనలు, సలహాలను తీసుకున్నారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తోపాటు ప్రత్యేక బలగాలు, ఏజెన్సీల సిబ్బందిని రంగంలోకి దించనున్నారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలతోపాటు 2.8 కిలోమీటర్ల సర్క్యూట్ ట్రాక్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నారు. అంతర్జాతీయ ఈవెంట్ కావడంతో రేసర్లు, సహాయక సిబ్బంది కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనే విధంగా భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. వైద్య బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, అంబులెన్స్‌లు మొదలైన వాటిపై సైతం సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మొదటిసారి రేస్ నిర్వహిస్తుండటంతో ఎంతో ఉత్కంఠ నెలకొందని తెలిపారు. ప్రజల భద్రత అత్యంత కీలకమని, మరిన్ని ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. టికెట్ల విక్రయాల నుంచి ఈవెంట్ పూర్తయ్యే వరకు అన్ని అంశాల్లో జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రత్యేక పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు సిపిలు విక్రంసింగ్ మెన్నన్, ఎఆర్ శ్రీనివాస్, హెచ్‌ఎండిఎ చీఫ్ ఇంజినీర్ బిఎల్‌ఎన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఈవెంట్ నిర్వాహకులు, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.